క్లుప్తంగా

అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపర్చాలి

డీఈఓ రేణుక



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు అభ్యసన సామర్థ్యాన్ని మెరుగుపర్చాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక పేర్కొన్నారు. మంగళవారం చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన డీఈఓ రేణుక ఎస్‌ఏ-1 పరీక్షల తీరును పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలను అభివృద్ధి పరచుకుని, విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. ఆమె వెంట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం షేక్ ఎండీ ఖాసిం, ఉపాధ్యాయులు ఉన్నారు.

పెన్షనర్ల హక్కుల సాధనలో సమష్టి కృషి అవసరం



గుంటూరు ఎడ్యుకేషన్: పెన్షనర్ల న్యాయబద్ధమైన హక్కుల సాధనలో సమష్టి కృషి అవసరమని జిల్లా విశ్రాంత న్యాయమూర్తి ప్రభాకర శర్మ పేర్కొన్నారు. మంగళవారం బ్రాడీపేటలోని బీహెచ్ హైస్కూల్లో బ్రాహ్మణ ఉద్యోగ, ఉపాధ్యాయ సంక్షేమ సేవా సమితి ఉమ్మడి గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రభాకర శర్మ మాట్లాడుతూ పెన్షనర్ల వ్యక్తిగత, న్యాయ పరమైన సమస్యలను పరిష్కరించుకునేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. సేవా సమితి అధ్యక్షుడు జంగాలపల్లి పార్థసారథి మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీ ఎన్జీవో నాయకుడు నరసింహమూర్తి మాట్లాడుతూ ఉద్యోగులకు చెల్లించాల్సిన డీఏ బకాయిలతో పాటు కొత్త డీఏలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా మూడేళ్లుగా పెన్షనర్లకు రావాల్సిన లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, పీఎఫ్, జీఐఎస్, డీఏ బకాయిలను చెల్లించడంతో పాటు ఐఆర్ ప్రకటించి, పీఆర్సీ నూతన కమిటీని ఏర్పాటు చేసి అమలు పర్చాలని తీర్మానాలు చేశారు.

పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలి..

తెనాలిఅర్బన్: పీఆర్సీ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెనాలి యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు మాచిరాజు రామకృష్ణమూర్తి, పి.ఎల్.జి సూర్యప్రకాశరావులు కోరారు. పెన్షనర్స్ డే సందర్భంగా కొత్తపేటలోని పెన్షనర్స్ హాల్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. అనంతరం 75 సంవత్సరాలు నిండిన సభ్యులను సన్మానించారు.

• పెన్షనర్స్ డేను ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బస్టాండ్ సమీపంలోని ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శివశంకరరావు, కె.బి. ప్రసాద్ మాట్లాడారు. 2014లో పరిపాలన చేసిన ఎన్‌డీఏ ప్రభుత్వం ఓపీఎస్ స్థానంలో సీపీఎస్‌ను, ఎన్‌పీఎస్‌ను తెచ్చిందన్నారు. దీని వల్ల ఉద్యోగులు చాలా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

గోదాదేవీకి సీతారామచార్యులు స్మారక పురస్కారం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం పద్మావతి కళ్యాణ వేదికపై మంగళవారం దివంగత కోగంటి సీతారామచార్యుల జయంతి నిర్వహించారు. పాలక మండలి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ఉపన్యాస భారతి ఎంవీ సత్యవతి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి ఉపన్యాస భూషణ కూర్మనాథస్వామి మాట్లాడుతూ ఉభయ వేదాంత ప్రవీణ శ్రీమాన్ కోగంటి సీతారామాచార్యుల శిష్యరికంలో సంస్కృతాంధ్ర భాషల్లో లబ్ధి ప్రతిష్టలుగా కీర్తి గడించారని అన్నారు. డాక్టర్ కోగంటి రంగనాయకి మాట్లాడుతూ తమ తండ్రి సీతారామచార్యులు స్మారక పురస్కారాలను 11 మందికి అందజేశామని అన్నారు. వచ్చే ఏడాది శత జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సీతారామచార్యులు రాసిన అష్టలక్ష్మీ స్తోత్రంపై కూనిశెట్టి (చలువాది) స్వరాజ్యలక్ష్మి శ్రావ్యంగా, సోదాహరణంగా వివరించారు. ఈ ఏడాది సీతారామచార్యుల పురస్కారాన్ని విశ్రాంత హిందీ అధ్యాపకురాలు తూపురాణి గోదాదేవికి ప్రదానం చేసి, నూతన వస్త్రాలు, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ డీఎస్.దీక్షిత్, డాక్టర్ ఏవీ దక్షిణామూర్తి, డాక్టర్ ఎన్వీ రమణారావు, డాక్టర్ కేవీఎల్ఎన్ అప్పలాచార్యులు, డాక్టర్ ఎం.లలితకుమారి పాల్గొన్నారు.

డ్రైయిన్లు తవ్వేశారు.. వదిలేశారు!

నలభై రోజులు దాటినా కదలని నిర్మాణ పనులు

- మురుగునీరు స్తంభించడంతో భరించలేని దుర్వాసన
- బేరాల్లేక వ్యాపారులకు అవస్థలు

అధికారుల నిర్లక్ష్యం నగరవాసులకు శాపంగా మారుతోంది. అభివృద్ధి పేరుతో అధికారులు హడావుడి చేస్తున్నారు. కానీ పూర్తి చేయడంలో శ్రద్ధ చూపడం లేదు. దీంతో ఇటు ప్రజలు.. అటు వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సాంకేతిక సమస్య పేరుతో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.



వ్యాపారులకు అడ్డుగా మారిన బండరాళ్లు



విస్తరణ పనుల్లో కాలువ తవ్వడంతో రోడ్డుపైన సామాన్లు ఉంచిన దృశ్యం

నగరంపాలెం: గుంటూరు రైల్వేస్టేషన్ రోడ్డుకు ఇరువైపులా డ్రెయిన్ల నిర్మాణానికి కార్పొరేషన్ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఇరువైపులా కాలువలు పగులకొట్టారు. ఇప్పటికే నలభై రోజులు దాటింది. ఇంత వరకు అటువైపు ఎవరూ కన్నెత్తి చూడటంలేదు. ఉన్న ప్రధాన కాలువలు దుకాణదారులను, స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. దీంతో దుకాణాలకు కొనుగోళ్లు చేసేవారు కూడా రాకపోవడంతో వ్యాపారాలు దారుణంగా పడిపోయాయి. జీఎంసీ అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరించడంతో దుకాణదారులు గగ్గోలుపెడుతున్నారు.



రైల్వేస్టేషన్‌రోడ్డు సులభ్ కాంప్లెక్స్ ఎదురు కాలువ దుస్థితి..

అవస్థలు ఇలా..

గుంటూరు తూర్పు వైపు ఉన్న రైల్వేస్టేషన్ చేరేందుకు వయా రైల్వేస్టేషన్ రోడ్డు మీదగా రాకపోకలు చేస్తుంటారు. జీజీహెచ్ ఓపీ విభాగం, గుంటూరు రైల్వేస్టేషన్, నాజ్ సెంటర్ వచ్చేందుకు రోగులు, వారి సహాయకులు, ప్రయాణికులు, వాహనదారులు ఎక్కువగా ఇటువైపు వస్తుంటారు. రైళ్లు వచ్చే వేళల్లో మరింత రద్దీగా ఉంటుంది. పనులు ఆలస్యం అవుతుండడంతో దుకాణదారులు వారి దుకాణాలకు వచ్చేందుకు ప్రధాన కాల్వలపై తాత్కాలికంగా పెద్ద చెక్క బల్లలను ఏర్పాటు చేసుకున్నారు. అయితే కొన్ని చోట్ల కాల్వలను పగులకొట్టకుండా వదిలేశారు. మిగతా వారు మామూలుగానే వ్యాపారాలు చేసుకుంటున్నారు.

పారిశుద్ధ్యాన్ని పట్టించుకోవడం లేదు..

నిర్మాణ పనులు జరుగుతున్నాయనే నెపంతో పారిశుద్ధ్య కార్మికులు ఇటువైపు కన్నెత్తి చూడటంలేదు. దీంతో మురుగు నీరంతా నిలిచిపోతుంది. భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. మురుగునీరు కదలకపోవడంతో ఆయా ప్రాంతాలు దోమలకు కేంద్రాలుగా మారాయి. దోమల ధాటికి సాయంత్రం వేళల్లో దుకాణాల్లో ఉండలేకపోతున్నామని దుకాణదారులు వాపోతున్నారు. కనీసం పనులు నిర్మాణాలు చేపడితే బాగుంటుందని చెప్పారు. రైల్వేస్టేషన్‌రోడ్డులోని జీజీహెచ్ క్యాన్సర్ ఆసుపత్రి ఎదురు, మసీదు వద్ద, పల్లవి థియేటర్ వద్ద నుంచి చివరి వరకు కాల్వలు అధ్వానంగా మారాయి.

బేరాల్లేవు..

కాలువలకు అవతలి వైపునున్న దుకాణాల వద్దకు కొనుగోలుదారులు పెద్దగా రావడం లేదు. పొరపాటున కాలు జారి కాల్వల్లో పడిపోతామనే భయం వారిలో వెంటాడుతుంది. దీంతో అనేక మంది వ్యాపారులకు పగులకొట్టిన కాల్వలతో బేరాలు ఉండటంలేదు. తొలగించిన రాళ్లను అక్కడే వేయడంతో రాకపోకలకు మరింత ఇబ్బందిగా ఉంటుంది. ఆఖరికి సిమెంట్ దిమ్మెలను దుకాణాల ఎదుట వేయించాకుంటామని జీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువచ్చిన ఒప్పుకోవడంలేదని దుకాణదారులు వాపోతున్నారు. ఇలాగైతే వ్యాపారాలకు పూర్తిగా నష్టం వాటిల్లుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలా వరకు నష్టపోతున్నామని చెబుతున్నారు.



పల్లవి థియేటర్ వద్ద మురుగుకాలువ..

పనులు చేపడితే అందరికి ప్రయోజనం..



ప్రధాన కాల్వలు విస్తరణ పనుల నిమిత్తం చర్యలు చేపట్టారు. అయితే వారాలు గడిచిన నిర్మాణ పనులు ప్రారంభించలేదు. దీంతో చాలా మంది దుకాణదారులకు వ్యాపారపరంగా ఇబ్బందిగా ఉంది. కాల్వల నిర్మాణ పనులు చేపడితే అందరికి ప్రయోజనకరంగా ఉంటుంది. ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– కోటేశ్వరరావు, దుకాణదారుడు

రాష్ట్ర యూనిట్ ప్రకారమే వర్గీకరణ చేపట్టాలి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మయ్యమాదిగ



నెహ్రూనగర్: రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణపై ఏర్పాటు చేసిన కమిషన్‌ను స్వాగతిస్తున్నామని, అయితే వర్గీకరణ జిల్లాల యూనిట్‌గా కాకుండా రాష్ట్ర యూనిట్ ప్రతిపాదికన తీసుకుని చేపట్టాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్యమాదిగ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం గుంటూరులోని అంబేడ్కర్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను జిల్లాల వారీగా చేయాలని చూస్తున్న నేపథ్యంలో మాల, మాదిగల మధ్య విభేదాలు రేకెత్తే ప్రమాదం ఉందన్నారు. దీంతో పాటు మరికొన్ని కులాలు రిజర్వేషన్ ఫలాలు అందకుండానే దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఉంటుందని పేర్కొన్నారు.

ఎస్సీల్లోని అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం జరగాలంటే రాష్ట్ర యూనిట్‌గా వర్గీకరణ చేపట్టాలన్నారు. రిజర్వేషన్ల మూలంగా మాల, మాదిగల మధ్య విభేదాలు వస్తున్నాయని, దానిని పూరించడానికి శాశ్వత పరిష్కారం చూపాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర యూనిట్‌గా వర్గీకరణ చేపట్టిన తరువాతే రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఏటుకూరి విజయ్‌కుమార్, షాలేంరాజు, ఆనంద్, చిలువూరి నాగరాజు, కొమరాల శ్రీనివాసరావు, భూషణం, భవాని, జీవన్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు పక్కాగా నిర్వహించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య పనులు ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని, గ్యాంగ్ వర్క్‌ల ద్వారా డ్రెయిన్లు సమస్యాత్మక ప్రాంతాలు శుభ్రం చేయడంపై ప్రజారోగ్య అధికారులు దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. ఏటీ అగ్రహారం, ఎన్జీఓ కాలనీ, సాయి నగర్, నల్లపాడు, బుడంపాడు, శ్రీనివాసరావుతోట తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. అభివృద్ధి పనులను, ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న బహుళ అంతస్తు భవనాన్ని పరిశీలించి, అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మైక్రో ప్యాకెట్స్ వారీగా చేపట్టే పారిశుద్ధ్య పనుల్లో మెరుగుదల ఉండాలని, డ్రెయిన్లు శుభ్రం చేయడం లేదని పలు ఫిర్యాదులు అందుతున్నాయని, డ్రెయిన్లు తప్పనిసరిగా మధ్యాహ్నం సమయంలో గ్యాంగ్ వర్క్ ద్వారా శుభ్రం చేయాలని సూచించారు. శానిటేషన్ కార్యదర్శులు క్షేత్ర స్థాయిలో ఇంటింటి చెత్త సేకరణ, మెయిన్ రోడ్ల శుభ్రత, కమర్షియల్ సంస్థలు డ్రెయిన్లలో వ్యర్థాలు వేయకుండా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఎన్జీఓ కాలనీ పార్క్‌ని పరిశీలించి, ఓపెన్ జిమ్ పరికరాలు మరమ్మతులు గురవ్వడం ప్రత్యక్షంగా పరిశీలించి, తక్షణం మరమ్మతులు చేయాలని, పెండింగ్ పనులపై పార్క్ వాకర్స్ కమిటీతో చర్చించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డీఈఈని ఆదేశించారు. బుడంపాడులోని హిందూ, క్రిస్టియన్ శ్మశానవాటికలను పరిశీలించి, మౌలిక వసతుల కల్పనపై చర్యలు తీసుకోవాలని, ప్రధానంగా నీటి వసతి వెంటనే కల్పించాలని కోరారు. మెయిన్ రోడ్లపై అవసరాల మేరకు స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని, వాటికి తప్పనిసరిగా ఇండికేటర్స్‌ని దూరం నుంచే కనిపించేలా పెట్టాలని ఈఈలను ఆదేశించారు. బుడంపాడు మెయిన్ రోడ్‌లో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసుకున్న భవన కొలతలను పరిశీలించిన కమిషనర్ మాట్లాడుతూ భవన నిర్మాణ సమయంలోనే ర్యాంప్‌లు రోడ్ల మీదకు నిర్మాణం చేయకుండా నియంత్రించాలని ప్లానింగ్ కార్యదర్శులకు సూచించారు. నగర పాలక సంస్థ నుంచి తీసుకున్న ఆమోదిత ప్లాన్ మేరకు నిర్మాణం జరుగుతన్నదీ లేనిదీ కూడా పర్యవేక్షణ చేయాలన్నారు. పర్యటనలో డీఈఈలు మధుసూదన్, సతీష్, ఏసీపీ వెంకటేశ్వరరావు, ఆర్ఓలు రెహ్మాన్, రవి కిరణ్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల దహనం



విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

లక్ష్మీపురం: ప్రజలపై విద్యుత్ అదనపు భారాలు మోపే ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించి రాష్ట్ర ప్రభుత్వం అదానీ కంపెనీలతో చేసున్న విద్యుత్ ఒప్పందాలు రద్దు చేసుకోవాలని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, ఐద్వా నగర అధ్యక్షురాలు గుంటుపల్లి రమణ అన్నారు. స్థానిక వెంకటాద్రిపేటలోని విద్యుత ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్ల బిగించటాన్ని వ్యతిరేకిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులను మంగళవారం దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గతంలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు అప్పటి అధికార వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారాలు మోపుతుందని రాష్ట్ర వ్యాపితంగా ''బాదుడే బాదుడు'' పేరుతో కార్యక్రమాలు చేశారని గుర్తు చేశారు. ఆ సందర్భంగా తెలుగు దేశం కూటమి అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి ప్రభుత్వం ప్రజలపై అదనపు భారాన్ని మోపుతుందని విమర్శించారు. ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించటాన్ని వ్యతిరేకించాలని, అవసరమైతే ఆ మీటర్లను పగలగొట్టండని పిలుపునిచ్చారని, ఆ పిలుపును ఇప్పుడు ఎందుకు అమలు చేయటం లేదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజాగ్రహం ఎదుర్కొనక తప్పదని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో ఈ నెలలో సుమారు 6 వేల కోట్ల రూపాయలు భారం రాష్ట్ర ప్రజలపై మోపిందని వివరించారు. ప్రీ పెయిడ్‌స్మార్ట్ మీటర్ల బిగిస్తున్నారని, ఆ స్మార్ట్ మీటర్లు బిగించటానికి ఖర్చు 15 వేల నుంచి 20 వేల రూపాయల వరకు అవుతుందని, ఆ ఖర్చు ప్రజల వద్ద నుంచి 10 సంవత్సరాల పాటు వసూలు చేస్తారని అన్నారు. భారాలను రాష్ట్ర ప్రజలు తిరస్కరించాలని, విద్యుత్ ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే వాటిని వ్యతిరేకించాలని, సంఘాలు చేసే ఆందోళనల్లో భాగస్వాములై తమ నిరసనను తెలియజేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాగేశ్వరి, రోజమ్మ ప్రభావతి, ఫాతిమా పాల్గొన్నారు.

అవిశ్వాసం తీర్మానం పై చర్చ గోష్టి



మాట్లాడుతున్న విద్యావేత్త రవిబాబు

లక్ష్మీపురం: రాజ్యాంగానికి 75 సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంలో లోక్ సభలో జరిగిన చర్చ ఆశించిన స్థాయిలో సాగలేదని దేశ ప్రజలందరికీ రాజ్యాంగంపై జరిగిన చర్చ లాగా కాక అవిశ్వాస తీర్మానం రచ్చలాగా అనిపించిందని విద్యావేత్త, విశ్లేషకులు ఎస్.రవిబాబు అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానంపై మంగళవారం నిర్వహించిన చర్చలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగంపై లోక్ సభలో జరిగిన చర్చ దేశ ప్రజలను నిరాశకు గురి చేసిందని, తాము ఎన్నుకున్న ప్రతి నిధులు దేశ భవిష్యత్‌కు అవసరమైన అంశం మీద మాట్లాడలేదని చెప్పారు. విశ్లేషకులు ఆర్.వి.సింగరయ్య మాట్లాడుతూ రాజ్యాంగం అమలులో ఎదురవుతున్న సవాళ్లను, విస్మరణలను కొపాతాపాలు లేకుండా చర్చించుకోవడం అవసరమని అయితే అధికార ప్రతిపక్షాలు ఈ సందర్భాన్ని కూడా ఎదుటి పక్షాన్ని తప్పు పట్టటానికి అవమానించటానికే వాడుకోవడం సరైంది కాదన్నారు. అనంతరం సంస్థ సభ్యులు రాజ్యాంగ చర్చా వేదిక కన్వీనర్ అవధానుల హరి, ఇంధు శేఖర్, నారపరెడ్డి, వెంకటరత్నం తదితరులు చర్చలో పాల్గొని ప్రసంగించారు.

సంగీత విద్వాంసుడు ఉస్తాద్ జాకీర్ హుస్సేన్‌కు ఘన నివాళి

లక్ష్మీపురం: భారత శాస్త్రీయ సంగీతానికి ప్రపంచ రాయబారిగా ప్రసిద్ధి చెందిన ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ మృతి సంగీత ప్రపంచానికి తీరని లోటు అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విద్వాంసుడు వి.ఎస్.ఎన్.మల్లేశ్వరరావు అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం సంగీత విద్వాంసుడు ఉస్తాద్ జాకీర్ హుస్సేన్‌కు సంతాప కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాసాధ అధ్యక్షుడు బిళ్లా అశోక్ మాట్లాడారు.

రోడ్డు పేరుతో ఇళ్లను తొలగించవద్దు



తాడేపల్లిరూరల్: రోడ్డు పేరుతో పేదల ఇళ్లను తొలగించవద్దని ప్రజా దర్బార్‌లో విద్యాశాఖ, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌కు స్థానికులు సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఎం రాజధాని శాఖ కార్యదర్శి ఎం.రవి మాట్లాడుతూ కొన్ని రోజులుగా రాజధాని గ్రామాల నుంచి ఈ లెవల్ రోడ్డు నివాసాల మీద నుంచి వెళ్తోందంటూ.. ప్రచారం జరుగుతోందని, అక్కడి ప్రజలు ఆందోళన చెందుతుండడంతో.. మంత్రికి విన్నవించినట్లు చెప్పారు. రోడ్డు పేరుతో నివాసాలను తొలగిస్తే ఉద్యమం చేపడతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎర్రబాలెం సీపీఎం శాఖ కార్యదర్శి అత్తలూరి వీర వెంకయ్య, టీడీపీ నాయకులు సాలి నరేష్, సాగర్, శ్రీనివాసరావు, యేసు, దయమ్మ పాల్గొన్నారు.

టెన్త్, ఇంటర్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

మోడల్ స్కూల్స్ జేడీ తాహేరా సుల్తానా

గుంటూరు ఎడ్యుకేషన్: మోడల్ స్కూళ్లలో చదువుతున్న 10వ తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులు వచ్చే ఏడాది మార్చిలో నిర్వహించనున్న పబ్లిక్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత నమోదు చేయాలని మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ తాహేరా సుల్తానా ఆదేశించారు. పాత బస్టాండ్ సెంటర్‌లోని జిల్లా పరీక్ష భవన్‌లో జోన్-3 పరిధిలోని మోడల్ హైస్కూళ్ల ప్రిన్సిపాల్స్‌తో సమీక్ష సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా తాహేరా సుల్తానా మాట్లాడుతూ జోన్-3 పరిధిలోని ప్రతి మోడల్ హైస్కూల్లో గత టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో నమోదైన ఉత్తీర్ణతా శాతాన్ని పరిగణలోకి తీసుకుని, వచ్చే పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధనకు అనుసరించాల్సిన ప్రణాళికలపై మార్గదర్శకాలు జారీ చేశారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు అభ్యసనాన్ని మెరుగుపర్చే విధంగా, ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిని పెంపొందించాలని సూచించారు. ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్‌ను అమలు చేసి, విద్యార్థులను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని కోరారు. ఉపాధ్యాయులందరితో సమావేశాన్ని నిర్వహించి, విద్యార్థుల ప్రగతి సమీక్షించుకోవాలని సూచించారు. 9వ తరగతి స్థాయిలో విద్యార్థులకు పాఠ్యాంశాలపై పూర్తి స్థాయిలో బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని సూచించారు. లిజనింగ్, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్ నేర్పడంలో సామర్థ్యాన్ని పెంపొందించే దిశగా పాఠశాల హోమ్‌వర్క్ కోసం మొబైల్ ఫోన్లు, ట్యాబ్లెట్లను వినియోగించరాదని తెలిపారు. స్లో లెర్నర్స్‌పై ప్రత్యేక దృష్టి కాపీ రాయడంతో పాటు, డిక్టేషన్, క్విజ్‌లను నిర్వహించాలన్నారు. విద్యార్థుల హాజరుతో పాటు శిక్షణ, సంస్కృతిలో భాగస్వామ్యాన్ని పెంచాలని సూచించారు. సమావేశంలో డెప్యూటీ డైరెక్టర్ రవి సాగర్, ఏడీ శరత్ బాబు, అకడమిక్ మానిటరింగ్ అధికారి కేవీ సత్యం పాల్గొన్నారు.

ధనుర్మాస ఉత్సవాలు

మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు బాపూజీ విద్యాలయంలో శ్రీ చిన్న జీయర్ స్వామి పర్యవేక్షణలో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. రెండవ రోజు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించిన స్వామిజీ, భక్తులకు అనుగ్రహ భాషణ, ప్రవచనం చేశారు.

భక్తిశ్రద్ధలతో సాముహిక శ్రీరామకోటి తులసి సహస్రనామార్చనలు



సంకీర్తనల అలాపన



శేషవాహనంపై శ్రీరామకోటి నగరోత్సవం

నగరంపాలెం: స్థానిక సంపత్‌నగర్‌లోని శ్రీరామనామక్షేత్రంలో శ్రీ శృంగేరి పీఠపాలిత శ్రీసీతారామ సంకీర్తన సంఘం, క్షేత్ర పాలకమండలి సభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో శ్రీరామకోటి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అఖండ సంకీర్తనతో ప్రారంభించారు. శ్రీమాన్ క్రోసూరి మురళీకృష్ణమాచార్యులు, ఆలయ అర్చకుల బృందంతో ధ్వజారోహణ, సంతానార్థులకు గరుడ ప్రసాద వితరణ నిర్వహించారు. సామూహిక శ్రీరామకోటి తులసి సహస్రనామార్చనలు, వేద పారాయణం అనంతరం జంధ్యాల కృష్ణకుమారి(హైదరాబాద్) పార్వతి కళ్యాణం హరికథ చెప్పారు. సాయంత్రం శ్రీ వెంకటా చలపతి బృందం(చెన్నై) మహా సంకీర్తనలతో శేషవాహనంపై శ్రీరామకోటి నగరోత్సవం కనుల పండువగా జరిగింది. భక్తులు, భక్తి సమాజాల శ్రీరామనామ సంకీర్తనతో ఆలయ ప్రాంగణం మారు మోగింది. శ్రీరామనామక్షేత్రం కార్య నిర్వాహకులు రాగం వెంకటలీలాసుందరి, మస్తాన్‌రావు దంపతులు, పోలిశెట్టి హరిప్రసాదరావు, సభ్యులు పాతకోటి బ్రాహ్మణయ్య నాయుడు పర్యవేక్షించారు.

నా 'పీఏ' దగ్గర పరిష్కరించుకోండి

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే దీక్ష మంగళవారం నాటికి 15వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉండవల్లి కృష్ణా కరకట్టపై ఉన్న నివాసంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. హైకోర్టు తీర్పు ప్రకారం తమకు న్యాయంగా రావాల్సిన రూ.43 కోట్లను యాజమాన్యం నుంచి అందే విధంగా చూడాలని కోరారు. అనంతరం దీక్షా శిబిరం వద్ద సీఐటీయూ నాయకుడు దుర్గారావు మాట్లాడుతూ అనేక రూపాల్లో ఇప్పటి దాకా కార్మికులు ఆందోళన చేసినా యాజమాన్యం స్పందించడం లేదన్న విషయాన్ని మంత్రి లోకేష్ దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. ఈ విషయమై స్పందించిన మంత్రి లోకేష్ ఫ్యాక్టరీ స్థలాల్లో గుడిసెలు వేయడం ఏంటని ప్రశ్నించారని, కోర్టు తీర్పు ప్రకారం ముందుకు వెళుతున్నట్లు తాము తెలియజేశామని తెలిపారు. ఈ విషయాన్ని తన వ్యక్తిగత కార్యదర్శి (పీఏ) వద్ద పరిష్కరించుకోవాలని మంత్రి సూచించారని తెలిపారు. పోరాట కమిటీ కన్వీనర్ కూరపాటి స్టీవెన్, కె.ఆదినారాయణ, బి.అంకయ్య, ఎం.ఆశీర్వాదం, వై.యెహోషువా, రమాదేవి, దుర్గా భవాని, ఎం.శివకుమారి, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.